క్లుప్తంగా

నేడు సీ క్యాంపు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సీ.క్యాంపు రైతుబజారును నేడు బంద్ చేస్తున్నట్లు ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టీకల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే రైతుబజారులో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా మంగళవారం సెలవు ప్రకటించినట్లు వారు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, వినియోగదారులు గమనించాలని కోరారు. బుధవారం నుంచి రైతుబజారు యథావిధిగా పనిచేస్తుందని వెల్లడించారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): రవాణా రంగ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ న్యూసిటీ కమిటీ అధ్యక్షుడు ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం దుర్గా హోటల్ సమీపంలోని సంఘం కార్యాలయంలో మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని లారీ డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కత్తిమీద సాములాంటి ఉద్యోగం చేస్తున్న డ్రైవర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. రవాణారంగానికి గుదిబండలా అయినా జీఓ నంబర్ 21, హిట్ అండ్ రన్ చట్టాలను తక్షణమే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రియాజ్, తిమ్మప్ప, దస్తగిరి, నరేంద్ర, శీను,కొండ, సమీర్ పాల్గొన్నారు.

2 నుంచి హ్యాపీనెస్ ప్రోగ్రామ్

కర్నూలు కల్చరల్: ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో జూలై 2 నుంచి 7వ తేదీ వరకు హ్యాపీనెస్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రతాప్‌రెడ్డి, దీప తెలిపారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని కర్నూలు హార్ట్ ఫౌండేషన్‌లో ప్రతి రోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఆరు రోజుల పాటు ఈ ప్రోగ్రామ్ జరుగుతుందని పేర్కొన్నారు. 'మీ ఆరోగ్యం- మీ జీవితం' అనే నినాదంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో యోగ, ప్రాణాయామం, ధ్యానం, సుదర్శన క్రియతో పాటు ఒత్తిడి నిర్మూలన ప్రక్రియలు నేర్పడం జరుగుతుందని, 18 సంవత్సరాల వయసు పైబడిన వారు ఇందులో పాల్గొన వచ్చని తెలిపారు. 77991 97656, 99497 34264, 63025 74520 సెల్ నంబర్ల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అప్పుడే జీవితం ఫలవంతమవుతుందని తిరుపతి ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రూపేశ్వర చైతన్య ప్రభు అన్నారు. కర్నూలు పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ మందిరంలో ప్రవచనం చెప్పారు. సమయం కాల సర్పం లాంటిదని మనకు తెలియకుండానే వేగంగా గడిచిపోతుందన్నారు. ప్రతి రోజు ముఖ్యమైందన్నారు. ప్రతివారిలో లోపాలు ఉంటాయని వాటిని సరిచేసుకోవాలన్నారు. వ్యక్తుల్లోని మంచి గుణాలను స్వీకరించాలని సూచించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రాంభూపాల్

కర్నూలు(సెంట్రల్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వి.రాంభూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తబస్టాండ్ సమీపంలోని కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సమావేశాల్లో రెండో రోజు సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో వివిధ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. మరోవైపు విద్యాసంవత్సరం ప్రారంభంకావడంతో విద్యారంగ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దడాల సుబ్బారావు, జిల్లా నాయకులు ఆనందుబాబు, ఈ.పుల్లారెడ్డి, శేషయ్య, జె.నాగేశ్వరారవు, ఎం.రాజశేఖర్, టి.రాముడు పాల్గొన్నారు.

వైద్యం చేసేందుకు సిద్ధంగా ఉండాలి

- వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం
- బాధితులకు సత్వరం అవసరమైన సేవలు అందించాలి
- వైద్య సిబ్బందితో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్



వైద్యులతో సీజనల్ వ్యాధులపై సమీక్షిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఎక్కువ కనుక అత్యవసర పరిస్థితుల్లో వైద్యం చేయడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, అతిసార వ్యాధులపై వైద్యులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో అతిసార, మలేరియా, డెంగీ కేసులు వస్తే వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రిలోని ఐడీ వార్డు కోసం 20 పడకల విభాగంలో మగవారికి 10 పడకలు, ఆడవారికి 10 పడకలు వెంటనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఐడీ వార్డులో అవసరమైన లైట్లు, ఫ్యాన్లు, వైరింగ్‌లను వెంటనే ఏర్పాటు చేయాలని ఎలక్ట్రికల్ సిబ్బందికి ఆదేశించారు. ఆయా వార్డుల్లో అవసరమైన సిబ్బందిని నియమించాలని నర్సింగ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఐడీ వార్డులో అవసరమైన వైద్య సిబ్బంది, వైద్యులు, హౌస్‌సర్జన్లు, పీజీ విద్యార్థులను అందుబాటులో ఉంచాలన్నారు. న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో అన్ని వైద్యపరీక్షలు నిర్వహించాలని, త్వరగా రిపోర్టులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్, ఆర్‌ఎంఓలను ఆదేశించారు. సీజనల్ వ్యాధులను అధిగమించే వరకు మెయిన్ డ్రగ్ స్టోర్‌లో మందులు అందుబాటులో ఉన్నాయో లేదో తనిఖీ చేయాలని ఫార్మాసిస్టు గ్రేడ్ వన్‌ను ఆదేశించారు. ఏవైనా మందులు అందుబాటులో లేకపోతే తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే స్థానికంగా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులను వెంటనే ఐడీ వార్డుకు అందజేయాలని చెప్పారు. డెంగీ కేసుల కోసం ప్లేట్‌లెట్లు, పీఆర్‌పీలను అందుబాటులో ఉంచుకోవాలని బ్లడ్ బ్యాంక్ సిబ్బందికి ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో అందరూ వైద్యులు, సహాయక సిబ్బంది రోగుల పట్ల అత్యంత శ్రద్ధ వహించాలని, కేసులను సమీక్షించాలని తెలిపారు. సమావేశంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. లక్ష్మీబాయి, ఐడీ వార్డు ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ డాక్టర్ బ్లెస్సీ మనోహర్, ఆసుపత్రి ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై. శ్రీధర్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, ఫార్మాసిస్టు గ్రేడ్ వన్ నరసింహరావు పాల్గొన్నారు.

రోగులకు మందులు అందుబాటులో ఉంచాలి

ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మందులను ఫార్మాసిస్టులు అందుబాటులో ఉంచుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులోని కాన్ఫరెన్స్ హాలులో ఫార్మసి మాడ్యుల్ ఈ- హాస్పిటల్ గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో ఫార్మసి మాడ్యుల్, ఈ-హాస్పిటల్ అమలు, అప్‌లోడింగ్ ప్రాసెస్‌పై మాక్ డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. రోగులకు సంబంధించిన మందులను ఆన్‌లైన్‌లోనే ఇండెంట్ చేయాలని, దానికి సంబంధించిన వివరాలను ఏ రోజుకు ఆ రోజు ఫార్మాసిస్టులు ఎంట్రీ చేయాలని, దీనిపై ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసుపత్రిలో రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో పేపర్‌లెస్ పద్ధతిలో వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో ఫార్మసి స్టోర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, ఫార్మసిస్ట్ నరసింహులు, ఎన్ఐసీ కో ఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

కర్నూలు(హాస్పిటల్): పెద్దాసుపత్రిలో పెద్ద డాక్టర్లుంటారని నమ్మి సుదూర ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడికి వస్తారని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి నిర్ణీత సమయంలో ఓపీలో ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. సోమవారం ఆయన ఆసుపత్రిలోని పలు ఓపీ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యం, తదితర విషయాలను వైద్యులు, సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. ఆర్థోపెడిక్ ఓపీ విభాగం సందర్శించిన అనంతరం రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. నడవలేని వారికి ఆర్థో ఓపీ విభాగంలో అక్కడే మందులు ఇచ్చే విధంగా చూడాలని సంబంధిత వైద్యులకు, ఫార్మసిస్టులకు, నర్సింగ్ సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, ఆర్థోపెడిక్ హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాసులు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ తదితరులు ఉన్నారు.

మోసపూరిత కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఖాతాదారులకు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీడీఓ నందీప్ బరద్వాజ్

కర్నూలు(అగ్రికల్చర్): మోసపూరిత కార్యకలాపాల పట్ల ప్రతి ఒక్క ఖాతాదారుడు అప్రమత్తంగా ఉండాలని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీడీవో, సీవోవో సందీప్ బరద్వాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆ బ్యాంక్ బ్రాంచీలో ఖాతాదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... కొన్ని మోసపూరిత బృందాలు, వ్యక్తులు అధిక రాబడి ఆశ చూపడం ద్వారా సున్నితమైన సమాచారాన్ని రాబట్టడంతో పాటు నిధులను కూడా తస్కరించే అవకాశం ఉందని తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ యూజర్‌ఐడీ, పాస్‌వర్డ్ వంటి ట్రేడింగ్ ఆధారాలు ఎవ్వరికి ఇవ్వవద్దని పేర్కొన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలకు గురైనప్పుడు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కస్టమర్ సర్వీస్ నంబరు 022-39019400 సంప్రదించాలని సూచించారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు శాంతారం భట్, ఆంజనేయ శర్మ, ముఖ్య అర్చకులు రాఘవ శర్మ, అర్చకులు మహానందీశ్వర ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార హారతులు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువు చేశారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది.

ఒత్తిడి లేకుండా చదివేందుకు ప్రణాళిక అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ బి. రమేష్‌బాబు

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థులు తీవ్ర ఒత్తిడి లేకుండా చదివేందుకు అవసరమైన ప్రణాళిక ముందుగానే తయారు చేసుకోవాలని మానసిక వైద్యులు డాక్టర్ బి. రమేష్‌బాబు చెప్పారు. సోమవారం స్థానిక కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు స్టడీ స్కిల్స్‌పై ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల వేసవి సెలవుల అనంతరం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఎంతో ఉత్సాహం, ఆనందంతో, సరికొత్త యూనిఫామ్ వేసుకుని, పుస్తకాలు, షూసుతో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తారన్నారు. ఈ సమయంలో వారి మనసు ఎంతో ఉత్సాహవంతగా ఉంటుందని తెలిపారు. అయితే తరగతి గదిలో చెప్పిన పాఠ్యాంశం ఏ రోజుకు ఆ రోజు మననం చేసుకుని చదువుకోవాలన్నారు. పరీక్షల సమయంలో అప్పటికప్పుడు చదివితే ఒత్తిడి పెరుగుతుందని, తద్వారా పరీక్షలు సరిగ్గా రాయక ఫెయిల్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. చదివిన విషయాలను సులభమైన పద్ధతులలో గుర్తుంచుకునే విధానాలను ఆయన సూచించారు. చదువుతో పాటు ఆటపాటలు, నిద్ర, మానసిక, శారీరక ఆరోగ్యం, సమతుల ఆహారం కూడా ముఖ్యమని చెప్పారు. వీటిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా అది చదువుపై పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ పి. ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

- నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్



వినతులు స్వీకరిస్తున్న నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్


కర్నూలు (టౌన్): ప్రజా సమస్యలపై వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నగర వాసుల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. అనంతరం ఇన్‌చార్జ్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఫిర్యాదుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, మొబైల్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్యాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ శేషసాయి, ఆర్ఓ జునీద్, టౌన్ ప్లానింగ్ అధికారి సంధ్య, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- పూలబజార్ ఇంటి నెంబర్ 21-12 పేరు బదిలీ కోసం సర్వే చేయమని కేజీ ఫణీ క్రిష్ణ ఫిర్యాదు చేశారు.
- వితంతు పెన్షన్ మంజూరు చేయాలని ధర్మపేటకు చెందిన నరసమ్మ, బుధవారపేటకు చెందిన ఈరమ్మ విన్నవించారు.
- తమ ఇంటి వద్ద గుంత ఏర్పడి వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే గుంతను పూడ్చేయాలని నాగేంద్రనగర్‌కు చెందిన మంగరాణి అనే మహిళా ఫిర్యాదు చేశారు.
- ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని కౌన్సిల్ హాలు పక్కన ఉన్న మున్సిపల్ స్థలంలో లైబ్రరీ, అర్బన్ హెల్త్ సెంటర్, యోగా సెంటర్‌లను ఏర్పాటు చేయాలని స్థానికులు విన్నవించారు.

సూక్ష్మపోషకాలు తెలుసుకో.. దిగుబడి పెంచుకో

- పంటల్లో సూక్ష్మపోషకాల పాత్ర కీలకం
- లోపిస్తే దిగుబడులపై ప్రభావం
- భూసార పరీక్షలతో గుర్తింపు
- కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి సూచనలు



కర్నూలు(అగ్రికల్చర్): పంటల పెరుగుదలకు ప్రధాన పోషకాలతో పాటు సూక్ష్మపోషకాల అవసరం ఎంతో ఉంది. ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ అందుబాటులో ఉన్నా పంటల్లో సూక్ష్మపోషకాల లోపాలు ఉంటే దిగుబడులు తగ్గుతాయి. వివిధ పంటలకు సూక్ష్మ పోషకాల లోపం ప్రధాన సమస్యగా మారుతుంది. రైతులు ఈ లోపాలను గుర్తించలేక చీడపీడలనే ఉద్దేశంతో అడ్డూఅదుపు లేకుండా పురుగు మందులు వాడుతూ నష్టపోతుంటారు. భూసార పరీక్షల ద్వారానే సూక్ష్మ పోషకాల స్థాయి తెలుస్తుంది. కావున భూసార పరీక్షలు ఎంతో ముఖ్యం. సూక్ష్మపోషకాల లోపం వల్ల పంటల్లో ఏర్పడే లక్షణాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఖరీఫ్ సాగు నేపథ్యంలో కర్నూలు సబ్ డివిజన్ సహాయ సంచాలకులు ఎన్.సాలురెడ్డి సూక్ష్మ పోషకాల లోపాల లక్షణాలను వివరించారు.

సూక్ష్మపోషకాలంటే..?

జింక్, ఇనుము, బోరాను, రాగి, మాంగనీసు, మాలిబ్డినం, క్లోరిన్ వంటి వాటిని సూక్ష్మపోషకాలుగా వ్యవహరిస్తారు. రైతులు ప్రధాన పోషకాలు మాత్రమే వాడటానికి అలవాటు పడ్డారు. సూక్ష్మపోషకాలను వాడటం లేదు. నేలలో ఏ ఒక్క సూక్ష్మపోషక పదార్థం లోపం ఉన్నా.. ప్రధాన పోషక పదార్థాలు సరైన ఫలితాన్ని ఇవ్వవు. అందువల్ల నేలలో సూక్ష్మపోషకాల లోపాలు ఉంటే ఎరువులను వేసుకుని లోపాలు పంటపైకి రాకుండా నివారించుకోవాల్సిన అవసరం ఉంది.

జింక్ ధాతువు

పత్తిలో జింక్‌లోపం విత్తిన మూడు వారాల తర్వాత కనబడుతుంది. ఆకుల మధ్యభాగంలో పాలిపోయినట్లు కనిపిస్తాయి. తుప్పు పట్టినట్లుగా అనిపించే మచ్చలు ముదురు ఆకులపై నుంచి లేత ఆకులపైకి విస్తరిస్తాయి. ఆకులు పెలుసుగా మారుతాయి. వరి, వేరుశనగ, మొక్కజొన్న, నిమ్మ, అరటి, మామిడి, జామ, టమాటట, మిరప, పెసర, మినుము పంటల్లో జింక్ ధాతువు లోపాలు ఏర్పడతాయి. ప్రస్తుతం ఉన్న పంటలు, పండ్ల తోటల్లోనూ జింక్ లోపం లక్షణాలు కనిపిస్తే లీటరు నీటికి 3 నుంచి 5 గ్రాముల జింక్ సల్ఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. వరి, వేరుశనగ, పత్తి, మొక్కజొన్న వేసే రైతులు ముందుగా ఎకరాకు 20 కిలో జింక్ సల్ఫేట్ భూమిలో వేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. పైరుపై జింక్ లోపం కన్పించగానే లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేటు కలిపి 5 రోజుల్లో 2,3 సార్లు పిచికారీ చేయాలి.

ఇనుప ధాతువు

ఆకుల్లో పత్రహరితం తయారు కావడానికి ఇనుము ఆధారం. ఇది పిండి పదార్థం తయారీకి ఉపయోగపడుతుంది. ఆకుల ఈనలు ఆకుపచ్చగా ఉండి మధ్య భాగంలో పసుపుపచ్చగా మారి తర్వాత తెలుపునకు తిరుగుతాయి. వరి, వేరుశనగ పంటల్లో దీని ప్రభావం ఉంటుంది. వాటర్‌షెడ్ ప్రాంతాల్లో ఈ ధాతువు లోపం అరటి, నిమ్మ, మామిడి, దానిమ్మ పంటల్లో కనిపిస్తాయి. బావులు, బోర్లు, ఇతర నీటిపారుదల కింద ఉన్న పంటల్లో ఈ లోపం ఉంటే 5 గ్రాముల ఐరన్ సల్ఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

రాగి ధాతువు

ఆకుల చివర్లు పాలిపోయినట్లు ఉంటాయి. ఆకులు పెలుసుగా ఉండి చీలిపోతాయి. ఈ ధాతువు లోపం, వరి, చెరుకు, వేరుశనగ, శెనగ, దానిమ్మ, మల్లెల్లో కనిపిస్తుంది. లోపం ఉన్నట్లు గుర్తిస్తే 5 గ్రాముల మైలుతుత్తంను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

బోరాన్ లోపం

మొగ్గ చనిపోతుంది లేదా వస్తున్న ఆకులు పాలిపోతాయి. ఆకులు మొద్దుగా మారతాయి. వంకర్లు పెలుసుగా ఉంటాయి. గోధుమ రంగు కొరడా లాగా కూడా ఉండవచ్చు. పండ్లు పగులుతాయి. బెండువారిన పండ్లు తయారవుతాయి. అరటిలో గెల బరువు తగ్గి కాయలు చిన్నగా ఏర్పడి పగుళ్లు వస్తాయి. అరటి, నిమ్మ, టమాట, క్యాబేజీ, బొప్పాయి, జామలో బోరాన్ లోపం కనిపిస్తుంది. మొక్కలు నాటుకునే ముందు 20 గ్రాముల బోరాను వేసుకోవాలి. నాటిన తర్వాత అయితే 2 గ్రాముల బోరిక్ ఆసిడ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

ఓర్వకల్లు: చిరుధాన్యాల సాగుపై నంద్యాలకు చెందిన ప్రాంతీయ పరిశోధన స్థానం వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సోమవారం ఓర్వకల్లు రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సస్యరక్షణ శాస్త్రవేత్త నరసింహులు చిరుధాన్యాల్లో వివిధ వంగడాల కాలపరిమితి, అంతర పంటల సరళి, అనువైన వంగడాల గురించి వివరించారు. జొన్న, పొగాకులోని వంగడాల గురించి పుల్లిబాయి తెలియజేశారు. జొన్న, కొర్ర పంటల్లో వచ్చే పలు రకాల పురుగుల నివారణపై శాస్త్రవేత్త వెంకటరమణమ్మ అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సీ సబ్ ప్లాన్ కింద కొర్రలోని వివిధ వంగడాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోత్స్న కిరణ్మయి, ఏఓ సుధాకర్ పాల్గొన్నారు.

టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్



పాణ్యం:తన భార్య, అత్తపై దాడి చేసిన వారిని శిక్షించి తమకు న్యాయం చేయాలని ఓ వ్యక్తి పాణ్యం బస్టాండ్ వద్దనున్న బీఎస్ఎన్ఎల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. ఎస్ఐ అశోక్ వివరాల మేరకు.. పాణ్యంకు చెందిన శ్రీనివాసులు భార్య రమాదేవి, సులోచన తోడికోడళ్లు. ఇద్దరూ తరచూ గొడవపడేవారు. ఈ నెల 22వ తేదీ సులోచన తండ్రి నాగన్న మరికొందరితో కలిసి రమాదేవి ఆమె తల్లి రామాంజనమ్మపై దాడి చేశారు. నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స తీసుకుని సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చారు. ఈ క్రమంలో తమకు న్యాయం చేయాలని రమాదేవి భర్త శ్రీనివాసులు సెల్‌టవర్ ఎక్కాడు. కొందరు టవర్‌పైకి ఎక్కి అతడికి సర్దిచెప్పి కిందకు దింపారు. రామాంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన పెంచుకోండి



పొదుపు మహిళలతో ఇండియన్ బ్యాంక్ అధికారిణి

కర్నూలు (అగ్రికల్చర్): పొదుపు మహిళలు బ్యాంకుల నుంచి రుణాలు పొందడంలో అవగాహన పెంచుకోవాలని ఇండియన్ బ్యాంక్ స్వయం సహాయక సంఘ రుణముల శాఖ బ్రాంచ్ మేనేజర్ శృతి సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక బ్యాంకులో స్వయం సహాయక సంఘాల సభ్యులు, సీసీలు, బుక్ కీపర్లకు రుణాలు పొందడంపై అవగాహన కల్పించారు. ఇండియన్ బ్యాంకు కల్పిస్తున్న సదుపాయాలు, వడ్డీ రేట్లు, ఇతర రాయితీల గురించి వివరించారు. రూ.20 లక్షల వరకు గరిష్టంగా రుణ సదుపాయం కల్పిస్తామని, ఈ అవకాశాన్ని పొదుపు సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్లు రాజశేఖర్, మురళీమోహన్‌రెడ్డి, నరేష్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ మురళి, టౌన్ మిషన్ కో-ఆర్డినేటర్లు సుధాకర్, విజయభారతి, ఇండియన్ బ్యాంకు సిబ్బంది నాగరాజు, సంధ్య, అరిఎయా తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

కర్నూలు (టౌన్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వర్షాకాలం ప్రారంభం కావడంతో మలేరియా విభాగం మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ త్యాగరాజు ఆదేశించారు. డెంగీ కేసు నమోదు కావడంతో సోమవారం స్థానిక నగరపాలక సంస్థ పరిధిలోని కొత్తపేట, రోజా వీధిలో ఆయన మలేరియా సిబ్బందితో పర్యటించారు. అక్కడి స్థానికులతో మాట్లాడారు. నిల్వ నీరు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరపాలక మలేరియా విభాగం అధికారి వెంకటేషులు మాట్లాడుతూ ఇప్పటికే ప్రతి వార్డులో మలేరియా నివారణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది నిత్యాపూజయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పర్యాటకం.. నవ్యశోభితం

- శరవేగంగా పర్యాటక శాఖ హోటల్స్, రెస్టారెంట్ల ఆధునీకరణ పనులు
- కర్నూలు పున్నమి రెస్టారెంట్‌కు కొత్త రూపు



కర్నూలు హరిత పున్నమి రెస్టారెంట్

కర్నూలు కల్చరల్: పర్యాటక శాఖ హోటల్స్, రెస్టారెంట్లు నూతన శోభను సంతరించుకోనున్నాయి. పర్యాటకులను ఆకర్షించడంతో పాటు రెస్టారెంట్లకు వచ్చిన వారికి ఆహ్లాదకరవాతావరణం కల్పించేందుకు ఆ శాఖ చర్యలు చేపట్టింది. కర్నూలు, శ్రీశైలం యూనిట్లలో నాలుగు నెలల క్రితం ఆధునికీకరణ పనులు ప్రారంభమయ్యాయి. మరో రెండు నెలల్లో పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు పనులు వేగవంతం చేశారు. మొత్తం రూ.18 కోట్ల నిధులతో ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. కర్నూలు యూనిట్‌లో హరిత పున్నమి హోటల్, బార్ అండ్ రెస్టారెంట్ ఆధునీకరిస్తున్నారు. నూతనంగా 12 గదుల నిర్మాణం చేపడుతున్నారు. అలాగే ఆవరణలో ల్యాండ్ స్కేపింగ్,లైటింగ్, సీటింగ్ బెంచెస్, ఎంట్రెన్స్ గేట్ పనులు జరుగుతున్నాయి. శ్రీశైలంలో యూనిట్‌లో 54 గదుల రెనోవేషన్ పనులతో పాటు నూతనంగా 30 గదుల నిర్మిస్తున్నారు. కాంపౌండ్ వాల్ నిర్మాణం, ల్యాండ్ స్కేపింగ్, సైన్‌బోర్డ్స్, ఎంట్రెన్స్ గేట్ ఏర్పాటు చేస్తున్నారు. త్వరలోనే ఈ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తామని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈఈ ఈశ్వరయ్య తెలిపారు.





ఇదేనా 'స్వచ్ఛత'

చెత్తాచెదారంతో నిండిపోయిన ఈ ప్రదేశం ఎక్కడో నగర శివారులోనిది కాదు. నగరం నడిబొడ్డులోని పాత్తబస్టాండ్ వద్దే ఉంది. అది కూడా నగరంలోని చెత్తాచెదారాన్ని తీసుకెళ్లే వాహనాలు నిలిపిన దగ్గరే. అయితే, రోజూ ఇటువైపు వచ్చే మునిసిపల్ అధికారులు, సిబ్బందికి పేరుకుపోయిన ఈ అపరిశుభ్రత కనిపించడం లేదేమో తొలగించకుండా అలాగే వదిలేశారని పక్కనున్న పూలబజార్ వ్యాపారులు, స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

అనుమతి ఉన్న విత్తనాలనే విక్రయించాలి

కోడుమూరు రూరల్: వ్యవసాయశాఖ అనుమతి ఉన్న విత్తనాలనే రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ దుకాణదారులను ఆదేశించారు. సోమవారం కోడుమూరులోని విత్తన, ఎరువుల దుకాణాల్లో ఏఓ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విత్తనాలకు సంబంధించిన స్టాక్ రికార్డులు, లైసెన్స్‌లను పరిశీలించారు. ప్రతి దుకాణదారుడు అనుమతి ఉన్న కంపెనీల విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని, విత్తన కొనుగోలు సమయంలో రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. అనుమతి లేని విత్తనాలు, నకిలీలు అమ్మితే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం మూడు రకాల పత్తి విత్తనాలను ఏఓ సేకరించి పరీక్షల నిమిత్తం తాడేపల్లిగూడెం ల్యాబ్‌కు పంపించారు.

సుంకేసులకు పెరిగిన ఇన్‌ఫ్లో

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరద నీరు వస్తుండడంతో ఇన్‌ఫ్లో పెరిగినట్లు సోమవారం డ్యాం జేఈ రాజు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు 1050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఒక గేటును తెరిచి దిగువకు 912 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 130 క్యూసెక్కులు వదులుతున్నామని వెల్లడించారు. రిజర్వాయర్ సామర్థ్యం 1.235 టీఎంసీ ఉండగా కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తి స్థాయిలో నిండుకుందని ఆయన తెలిపారు.